క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలం బంగారుగూడ, మావల మండలంలోని కైలాస్‌నగర్, మావల ఫీడర్లలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ బేల ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్, కైలాస్‌నగర్, దస్నాపూర్, బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సభకు తరలిరండి

ఇంద్రవెల్లి: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో సోమవారం నిర్వహించనున్న ఆవేదన సభకు ఉపాధ్యాయ, ఉద్యోగ దంపతులు భారీగా తరలిరావాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు రాథోడ్ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పౌజ్ బదిలీలు జరగక భర్తలు ఒక జిల్లాలో భార్య మరోక జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ.. తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలతో పాటు సమాజంలోని సమస్యలపై ఉద్యమించడం, విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేలా ఏబీవీపీ కృషి చేస్తుందని ఏబీవీపీ పూర్వ కార్యకర్త బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద, సరస్వతి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ జెండా ఆవిష్కరించారు. దేశం, జాతీ, రాజకీయాలకు అతీతంగా ఏబీవీపీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పూర్వ కార్యకర్తలు మనోజ్, రాళ్లబండి మహేందర్, మనోజ్ పవార్, నిఖిల్, ప్రస్తుత కార్యకర్తలు కార్తీక్, మహేష్, సన్ని, ప్రవీణ్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న శర్మన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి గ్రామ సర్పంచ్ విఠల్ తండ్రి ఇటీవల మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని ఆదివారం రిటైర్డ్ కలెక్టర్ శర్మన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట గ్రామ నాయకులు, యూత్ సభ్యులు ఉన్నారు.

- మండల కేంద్రానికి చెందిన ముస్లిం మత పెద్ద సమీ మౌలానా శనివారం అనారోగ్యంతో మృతి చెందగా.. మృతుని కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు బాధావత్ పూర్ణ చందర్ నాయక్ ఆదివారం పరామర్శించారు.

కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ జిల్లా చైర్మన్‌గా అశోక్



అశోక్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

తాంసి: ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా తాంసి మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్‌ను నియమించారు. టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డా.విశ్వతేజశ్వర్ రావు నియామక పత్రం అందజేశారు. అశోక్‌ను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు ఘనంగా సన్మానించారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం

ఆదిలాబాద్‌టౌన్: పేదల ఆకలి తీర్చడమే సంగెం చారిటబుల్ ట్రస్ట్ ధ్యేయమని నిర్వాహకుడు సంగెం సుధీర్ కుమార్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, లఖన్, శేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

విరాళాల అందజేత

బోథ్: పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు బస్‌పాసుల కోసం పలువురు విరాళాలు అందజేశారు. సోనాల సర్పంచ్ రూ.5000, ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఫోరం రూ.3000, రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మి నర్సయ్య రూ.3000, నేరడిగొండ సర్పంచ్ పెంట వెంకటరమణ రూ.3000, కౌట గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త రమణ గౌడ్ రూ. 2000లు అందజేశారు.

సమస్యల్లో పల్లె దవాఖానాలు

- అంతంత మాత్రమే వైద్య సేవలు
- సొంత భవనాలు కరువు
- ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లతోనే వైద్యం



సిరికొండ పంచాయతీ కార్యాలయంలో వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎం

ఇచ్చోడ: పల్లె దవాఖానాలు సమస్యలతో కొట్టుమిట్టడుతున్నాయి. దీంతో గ్రామీణా ప్రాంతవాసులకు సర్కారు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రారంభించింది. కాని 80 శాతం పల్లె దవాఖానాలకు సొంత భవనాలు లేక పోవడం, ఉన్నవాటిలో కనీస మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

వెక్కిరిస్తున్న ఖాళీలు..

పల్లె దవాఖానాలో వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. సగానికి పైగా దవాఖానాల్లో డాక్టర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో కేవలం ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ద్వారా మాత్రమే వైద్యం అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇక అంతే సంగతి.

- ఇచ్చోడలో మండలంలో తలమద్రి, గేర్జం, బోరిగామ గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయి. మూడు గ్రామాల్లో కూడా సొంత భవనాలు లేవు. రెండుచోట్ల డాక్టర్లు ఉండగా మరొక చోట స్టాఫ్ నర్సు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.
- బోథ్‌లో ఆరు పల్లె దవాఖానాలు ఉన్నాయి. ఆరు దవాఖానాల్లో ఒక్క డాక్టరే మాత్రమే ఉన్నాడు. ఐదు చోట్ల డాక్టర్లు లేక పోవడంతో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు వైద్య సేవలు అందిస్తున్నారు.
- నేరడిగొండలో ఏడు పల్లె దవాఖానాలు ఉన్నాయి. గుత్పల, వాంకిడి, తెజాపూర్, బుగ్గరాం, తర్నం, వడూర్‌లో డాక్టర్ల లేరు. పీహెచ్‌సీలోని వైద్య సిబ్బందే వైద్య సేవలు అందిస్తున్నారు.
- తలమడుగులో మండలంలో బరంపూర్, కుస్లాపూర్, ఉమ్రి, దేవపూర్ గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయి. డాక్టర్లు లేక పోవడంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదు.
- సిరికొండ మండల కేంద్రంలో పల్లె దవాఖానాలు లేవు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో వారంలో ఒక్కసారి ఏఎన్ఎం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.
- బజార్‌హత్నూర్‌లో ఐదు పల్లె దవాఖానాలు ఉన్నాయి. ఒక్కదాంట్లో కూడా వైద్యులు లేరు. వారంలో ఒక్కసారి స్టాఫ్ నర్సులు మాత్రమే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగానే మారింది.

వైద్యులను నియమించాలి



పల్లె దవాఖానాల్లో ప్రభుత్వం రెగ్యులర్ వైద్యులను నియమించాలి. పేరుకే పల్లెదవాఖానాలను పెట్టారు. డాక్టర్లు లేక పోవడంతో మెరుగైన వైద్య సేవలు అందడం లేదు.

– రాథోడ్ వినోద్, దేవుల్‌నాయక్‌తండా, ఇచ్చోడ

భవనాలు నిర్మించాలి



పల్లె దవాఖానాలకు ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలి. అప్పడే గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఆర్భాటంగా ప్రారంభించిన పల్లె దవాఖానాల్లో కనీస వసతులు కరువయ్యాయి.

– జంగు, గుబ్బ, ఇచ్చోడ

అండర్ బ్రిడ్జితో అవస్థలు



నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు కుప్టి, లఖంపూర్ అండర్ బ్రిడ్జి కిందికి వర్షపు నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అలాగే పలు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం'



మేడిగూడలో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్: బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని మేడిగూడ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పథకాలు, వరంగల్ రైతు డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఇద్దరు ఒకటే అని, వచ్చే ఎన్నికల్లో ఏ ఒక్కరికి ఓటేసిన వృథా అవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, రూ. 15వేల రైతుబంధు అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్, షకీల్, సంజయ్, అశోక్ రెడ్డి, శంకర్, కామ్రె మనోజ్, రాజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఇంద్రవెల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు భొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతిష్, శ్రీనివాస్, కత్త మల్లమ్మ, అరవింద్, సంజీవ్, రాందాస్, సురేశ్ పాల్గొన్నారు.

బోథ్: తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె చేస్తామని పంచాయతీ కార్మికులు అన్నారు. వారు చేపట్టిన సమ్మె ఆదివారానికి నాల్గో రోజుకు చేరింది. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఆదివారం దాదాపు 110 మంది దీక్షలో కూర్చున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్లు



శ్రీరాంకాలనీ రోడ్డు దుస్థితి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరాం కాలనీలో రోడ్లు బురదమయంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారి ప్రజలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. మట్టిరోడ్లు ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు సైతం ఆవాసంగా మాతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



స్పీచ్‌థెరపి సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రెరీ ప్రాంతంలో స్పీచ్‌థెరపి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రైట్ ఆటిస్మ్ అండ్ స్పీచ్ థెరపీ ఢిల్లీ కేంద్రంగా 34 కేంద్రాలు ఉండగా.. ఆదిలాబాద్ పట్టణంలో 35వ బ్రాంచ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఢిల్లీ, రాజస్థాన్‌కు చెందిన సీనియర్ థెరపిస్టులతో స్పీచ్ థెరపి, ఏడీహెచ్‌డీ, హైపర్ యాక్టివిటీ ఉన్న వారికి సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ థెరపిస్ట్ తన్వీర్, రూపాలి, బిపిన్, వార్డ్ కౌన్సిలర్ బండారి సతీశ్, అభిజీత్ నుగుర్వర్ పాల్గొన్నారు.

కళాకారులు నిజమైన సాంస్కృతిక వారధులు

జైనథ్: కవులు, రచయితలు నిజమైన సాంస్కృతిక వారధులని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ప్రముఖ కవి, రచయిత చిందం ఆశన్న రచించిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి స్థల పురాణ శతకం పద్య కావ్యాన్ని ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయంలో పూజలు చేసి, అనంతరం శతకం మొదటి ప్రతిని స్వామి వారి పాదాల వద్ద ఉంచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర ఏనలేనిదన్నారు. అనంతరం చిందం ఆశన్న దంపతులను ఎమ్మెలే సన్మానించారు.

భీమ్ చౌక్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో సుందరీకరించిన కుమురంభీమ్ చౌక్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ కోరారు. ఆదివారం చౌక్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సూచనల మేరకు సోమవారం సాయంత్రం చౌక్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆదివాసీలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు కుమ్రం శ్రీనివాస్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమురం రాజు, వైస్ ఎంపీపీ కుమ్రం జంగు పటేల్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, జోగు మహేందర్, తానాజీ, కుమ్రం రాజు, తినక సురేశ్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న దోడ అశోక్

నేరడిగొండ: ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు దోడ అశోక్ అన్నారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరికంటి మహేష్‌ను జిల్లా కుటుంబ భరోసా కార్యక్రమానికి ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఈపథకంలో రూ.10 చెల్లించి చేరాలని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రూ.10వేలు ఇవ్వడంతో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.లక్ష వరకు వారి కుటుంబానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, సంతోశ్, ప్రవీణ్, విజయ్, విశాల్, పెరమండ్ల సురేశ్, అన్వేష్, సంతోశ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. రోగాలపై సమరం

- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు
- ర్యాపిడ్ యాక్షన్ టీంల ఏర్పాటు
- ఇప్పటికే వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వానాకాలం సీజన్ ఆరంభమైంది. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశముంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందుజాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేకంగా ర్యాపిడ్ యాక్షన్ టీంలు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఎపిడమిక్ విభాగం ఏర్పాటు చేసి హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. 08732- 295065 నంబరులో సంప్రదిస్తే క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.

అవగాహన కార్యక్రమాలు..

వైద్యారోగ్య శాఖ జిల్లా, డివిజన్, పీహెచ్‌సీ స్థాయిలో ర్యాపిడ్ యాక్షన్ బృందాలను నియమించింది. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సీజనల్ వ్యాధులు నిర్ధారణ అయినట్లు సమాచారం తెలిస్తే వారు వెంటనే క్షేత్రస్థాయికి వెళ్తారు. జిల్లా స్థాయిలో మలేరియా అధికారి, ఆరోగ్య సూపర్‌వైజర్, ఆరోగ్య సహాయకుడు, ల్యాబ్ టెక్నీషియన్, పిచికారీ పర్యవేక్షణకు ఒకరుంటారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఎంహెచ్, సబ్ యూనిట్ అధికారి, ముగ్గురు ఆరోగ్య సహాయకులను నియమించారు. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ అధికారి, ల్యాబ్ టెక్నీషియన్, ఆశ, పంచాయతీ కార్యదర్శి, హెల్త్ సూపర్‌వైజర్ సేవలందిస్తారు. పీహెచ్‌సీల పరిధిలోని ఆశ కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందికి మే నెలలో శిక్షణ ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- వేడి పదార్థాలను తీసుకోవాలి. నిల్వ ఉన్నవి తినరాదు.
- బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి.
- చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటిసంపులు, నీటి పాత్రలపై మూతలు ఉంచాలి.
- వారానికోసారి నీరు నిల్వ ఉన్న పాత్రలు, డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రపర్చాలి. దోమ తెరలు వాడాలి.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే..

జిల్లాలో ఈ సీజన్‌లో ప్రబలే వ్యాధుల పట్ల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. జిల్లాలోని 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 89 సబ్‌సెంటర్ల కిందకు వచ్చే 718 గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే జూలై 1న ప్రారంభమైంది. మూడు నెలల పాటు కొనసాగుతోంది. ఇంటింటికీ తిరుగుతూ కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



డెంగీ, చికున్‌గున్యా ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. ప్రస్తుతం వానాకాలంలో వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉన్నాం. ప్రజలను చైతన్య పర్చడంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. వ్యాధుల నియంత్రణకు ర్యాపిడ్ యాక్షన్ టీంలను ఏర్పాటు చేశాం. గిరిజన ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేపడుతున్నాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్

పాట చిత్రీకరణ ప్రారంభం



పూజలు చేస్తున్న అజ్మీర శ్యామ్‌నాయక్

నార్నూర్: మండలంలోని గంగాపూర్ తండాలో శ్రీసంత్ మహాన్ తపస్వి రామ్‌రావు మహరాజ్ పాట చిత్రీకరణను ఆదివారం ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధి అజ్మీర శ్యామ్ నాయక్ మాట్లాడుతూ.. షూటింగ్ విజయవంతంగా పూర్తయి మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జగత్ జననీ జగదంబ దేవి మందిరంలో పూజలు చేశారు. కార్యక్రమంలో బంజారా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాథోడ్ బాబులాల్, ఎంపీటీసీ రాథోడ్ రమేష్, బంజార కవి జాదవ్ బంకట్ లాల్, ఆడే సురేశ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాథోడ్ నరహరి, రాథోడ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

భీమన్న దేవుడికి పూజలు



పూజలు చేస్తున్న రైతులు

బోథ్: మండలంలోని మేడి శివారులో రైతులు భీమన్న దేవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, శేఖన్న, మోహన్ రెడ్డి, సోమ శంకర్, గణేశ్, నాగన్న, భోజారెడ్డి, ఒస శంకర్, మహేందర్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అకాడి పండుగ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పందిరిలొద్ది గ్రామంలో ఆదివారం అకాడి పండుగను ఘనంగా నిర్వహించారు. ఏర్మ శేకు పటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అకాడి దేవుని అకాడి గోలా (జొన్న గట్క) ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. పశుసంపద, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో దేవరి ఏర్మా రాయు పటేల్, మహాజన్ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలి



బుర్కపల్లిలో సమావేశమైన లబ్ధిదారులు

నేరడిగొండ: పోడు భూముల పట్టాలను ఎస్సీ, బీసీ, మైనార్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం బుర్కపల్లిలో పోడు భూముల బాధితుల కమిటీని ఏర్పాటు చేశారు. ఎస్టీలకు ఇస్తున్న తరహాలోనే తమకు కూడా పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామని, తమకు పట్టాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోడు భూముల కమిటీ మండల నిర్వాహకుడు గస్కంటి రవి, గ్రామస్తులు రమేశ్, శంకర్, భీంరావు, హీరాసింగ్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.